
కాలవా ఇది వినవా..!

- టికెట్ల ఖరారుపై నంద్యాల సభలో మాట మార్చిన చంద్రబాబు
- అందరి అభిప్రాయాలు సేకరించాకే నా సీటు కూడా ప్రకటనంటూ వ్యాఖ్యలు
- 'దుర్గం' టీడీపీలో రగులుతున్న అసంతృప్తి సెగలు



రాయదుర్గం: రాయదుర్గం టీడీపీ అభ్యర్థి ఖరారుపై తెలుగు తమ్ముళ్లలో మరోసారి అంతర్మథనం ఏర్పడింది. రెండు రోజుల క్రితం నంద్యాల సభలో టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు టికెట్ల ఖరారుపై చేసిన సంచలన వ్యాఖ్యలు సర్వత్రా చర్చకు దారితీశాయి. అందరి అభిప్రాయాలు తీసుకుని 'నా సీటు' కూడా అప్పుడే నిర్ణయించుకుంటాం తప్పా ముందే ఎక్కడా సీట్ల నిర్ణయం ఉండబోదంటూ సభలో ప్రకటన చేశారు. అంతేకాక ఎన్నికల సమయంలోనే సీట్లపై నిర్ణయం తీసుకుంటాం..? పార్టీలో ఎవరికైనా సరే మినహాయింపు ఉండబోదు.. అందరితో సమావేశమై చర్చించాకే ఫైనలైజ్ ఉంటుందంటూ వ్యాఖ్యలు చేశారు. దీంతో రాయదుర్గంలో టిక్కెట్ వార్ మరోసారి తెరకెక్కింది. కాలవకు వ్యతిరేకంగా ఏర్పడ్డ ఓ స్థానిక కూటమి ఈ మాటలతో సంతోషం వ్యక్తం చేస్తూ లోలోపల మిఠాయిలు పంచుకున్నట్టు తెలిసింది. అధినేత నిర్ణయం ఓ రకమైతే కాలవ మాత్రం ఏదో కారణం చూపి మొసలికన్నీరు కార్చడంతోనే, చంద్రబాబు ఉత్తుత్తి ప్రకటన చేసి ఉంటారని సీనియర్లు గుసగుసలాడుకుంటున్నారు. చంద్రబాబుకు నిజంగా ఆ ఆలోచనే ఉండిఉంటే సభలో అభ్యర్థి పేరు ఖరారు చేసి ఉండేవారని బావిస్తున్నారు.

రగులుతున్న అసంతృప్తి సెగలు

టీడీపీలో రోజు రోజుకూ అసంతృప్తి సెగలు రగులుతున్నాయి. కాలవ అభ్యర్థిత్వంపై ఆ పార్టీలోని సీనియర్లు కొందరు బాహాటంగానే వ్యతిరేకించే పరిస్థితికి వచ్చారంటూ పుకార్లు షికార్లు చేస్తున్నాయి. పార్టీ ఆధ్వర్యంలో ఇటీవల చేపట్టిన బస్సు యాత్రకు టీడీపీ సీనియర్ నాయకులు దూరంగా ఉన్నారు. ఆఖరుకు అధినేత పర్యటనలోనూ సముచిత స్థానం కల్పించకపోవడంతో అగ్గిమీద గుగ్గిలమవుతున్నారు. ఓ ముఖ్య నాయకుడ్ని కనీసం సభ వేదికపై ఎక్కనీకుండా చేశారనే విమర్శలు సర్వత్రా వినిపించాయి. దీంతో అభ్యర్థి ప్రకటన చేశారంటూ కేకులు కోసి, మిఠాయిలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమానికి సైతం చాలా మంది పార్టీ సీనియర్లు దూరంగా ఉన్నారంటే వ్యతిరేకత ఏస్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు.

స్థానికులకే టిక్కెట్ ఇవ్వాలి

వచ్చే ఎన్నికల్లో నాన్‌లోకల్‌కు కాకుండా స్థానికుల్లోనే టిక్కెట్టు తెచ్చుకునేలా అందరం కలసికట్టుగా కృషి చేద్దామని సీనియర్లంతా ఇటీవల గోప్యంగా బళ్లారిలో సమావేశమై చర్చించినట్టు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. ఈ విషయాన్ని ఇప్పటికే పలుమార్లు చిన్నబాబు (లోకేష్) దృష్టికి సైతం తీసుకెళ్లామని కొంత మంది ప్రస్తావించారు. లేకపోతే స్వతంత్ర అభ్యర్థిగానైనా బరిలో నిలుస్తామని తెగేసి చెప్పుకునే స్థితికి చేరారు. రాయదుర్గంలో అభ్యర్థి ప్రకటన అంశం పై సీనియర్లంతా లోకేష్‌బాబు దృష్టికి తీసుకెళ్లి అడ్డుపడ్డారనే వార్తలు కూడా వినిపిస్తున్నాయి.

అభ్యర్థుల మార్పులో టీడీపీ దిట్ట

ఎన్నికల వరకూ కొనసాగించడం.. దగ్గపడే కొద్దీ సర్వేల పేరుతో రాయదుర్గంలో అభ్యర్థులను మార్చడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య. 1989నుంచి కాట గోవిందప్పతో పార్టీకి సేవలు చేయించుకుని చివరకు 1994లో హులుకుంటప్పకు టిక్కెట్ కట్టబెట్టారు. ఆ తర్వాత 1999లో మార్చి పూజారి జితేంద్రప్పకు ఇచ్చారు. 2004లో మళ్లీ మార్చి మెట్టు గోవిందరెడ్డికి టికెట్ కేటాయించారు. 2012లో జరిగిన ఉప ఎన్నికల్లో దీపక్‌రెడ్డికి టికెట్ ఇచ్చారు. 2014, 2019లో కాలవ శ్రీనివాసులకు ఇచ్చారు. ఇలా వరుసగా అభ్యర్థులను మార్చుతూ వస్తున్న చంద్రబాబు 2024లో కూడా ఆ మార్పు ఉంటుందేమోనని ఆ పార్టీ వర్గాలు భావిస్తున్నాయి.

క్లుప్తంగా

నేడు వాటర్ ప్లాంట్ ప్రారంభం

- హాజరుకానున్న మంత్రి ఉషశ్రీచరణ్

కళ్యాణదుర్గం: పట్టణంలోని బీసీ బాలికల వసతి గృహంలో సోమవారం మధ్యాహ 3.30 గంటలకు మంత్రి కేవీ ఉషశ్రీచరణ్ వాటర్ ప్లాంట్ ప్రారంభించనున్నారు. ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు హాజరు కావాలని మంత్రి క్యాంపు కార్యాలయం ఓ ప్రకటన విడుదల చేసింది.

దశభుజ గణపతికి పూజలు



అలంకరణలో దశభుజ గణపతి

రాయదుర్గంటౌన్: పట్టణంలోని దశభుజ గణపతి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానికులతోపాటు ఇతర ప్రాంతాల నుంచి భక్తులు హాజరై మొక్కులు తీర్చుకున్నారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోండి



గ్రంథాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ ఎల్ఎం ఉమాదేవి.

శెట్టూరు: గ్రంథాలయాలను పాఠకులు సద్వినియోగం చేసుకోవాలని ఆ సంస్థ చైర్‌పర్సన్ ఎల్ఎం ఉమాదేవి సూచించారు. ఆదివారం మండల కేంద్రంలోని గ్రంథాలయంలో ఆమె ఆకస్మిక తనిఖీ చేపట్టారు. ముందుగా రికార్డులను పరిశీలించారు. పాఠకుల కోసం గ్రంథాలయంలో అందుబాటులో ఉన్న పుస్తకాలు, హాజరవుతున్న పాఠకుల సంఖ్య ఆరా తీశారు. గ్రంథాయలంలోని పిల్లలతో మాట్లాడుతూ పుస్తక పఠనం వల్ల ప్రయోజనాలను వివరించారు. వారితో కథలు చెప్పించారు. కార్యక్రమంలో మండల గ్రంథాలయ అధికారిణి రజని, పాఠకులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా జయం విశ్వనాథ్



విశ్వనాథ్‌కు నియామక పత్రాన్ని అందజేస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

కళ్యాణదుర్గం: కళ్యాణదుర్గం ఆర్యవైశ్య సంఘం అధ్యక్ష ఎన్నికల్లో జయం విశ్వనాథ్ మరోసారి విజయం సాధించారు. ఆదివారం స్థానిక కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఆర్యవైశ్య సంఘం ఎన్నికలు నిర్వహించారు. 638 ఓట్లకు గానూ 529 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఇందులో జయం విశ్వనాథ్‌కు ఓట్లు 466 కాగా, ఎస్‌పీఆర్ గుప్తాకు 54 ఓట్లు, మరో తొమ్మిది ఇన్‌వాలిడ్ అయ్యాయి. పోటీల్లో జయం విశ్వనాథ్ విజయం సాధించినట్లు ఆర్యవైశ్య సంఘం నాయకులు తెలిపారు. తన ఎన్నికకు సహకరించిన ఆర్యవైశ్యులకు జయం విశ్వనాథ్ ధన్యవాదాలు తెలిపారు. ఆర్యవైశ్యుల సంక్షేమానికి కృషి చేస్తానన్నారు.

నివాళి



నాగరత్నమ్మ భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న మంత్రి ఉషశ్రీచరణ్

కంబదూరు: మార్కెట్ యార్డు మాజీ డైరెక్టర్ నాగరత్నమ్మ మృతి పార్టీకి తీరని లోటని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషశ్రీచరణ్ అన్నారు. మండలంలోని ములకనూరు గ్రామానికి చెందిన నాగరత్నమ్మ(40) అనారోగ్యంతో శనివారం మృతి చెందింది. ఆదివారం ఉదయం మంత్రి ఆ గ్రామానికి వెళ్లి మృతదేహానికి నివాళులర్పించి నాగరత్నమ్మ భర్త, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు గంగాధర్, అత్త సర్పంచ్ లక్ష్మీదేవమ్మను పరామర్శించారు. అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. మృతురాలికి ఇద్దరు కూతుర్లు, ఒక కుమారుడు అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర జానపద, సృజనాత్మక అకాడమీ డైరెక్టర్ బాబురెడ్డి, జెడ్పీటీసీ గుద్దెళ్ల నాగరాజు, ఎంపీపీ తిమ్మరాజమ్మ, బీసీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి గోవింద్, సర్పంచ్‌లు బాపూజీ, అమర్, వైఎస్సార్‌సీపీ నాయకులు హనుమంతరాయుడు, సాయినాథ్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, బయన్న తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీతోనే అభివృద్ధి



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

బ్రహ్మసముద్రం: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ మండల నాయకులు అన్నారు. ఆదివారం మండలకేంద్రంలో పార్టీ మండల కన్వీనర్ బసవరాజు, జెడ్పీటీసీ ప్రభావతి , ఎంపీపీ చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాతే అభివృద్ధి సాధ్యమైందన్నారు . ఇటీవలే టీడీపీ నాయకులు అభివృద్ధి జరగడం లేదని ప్రభుత్వంపై విమర్శలు చేస్తుండటంపై వారు మండిపడ్డారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత అభివృద్ధి, సంక్షేమం పరుగు తీస్తోందన్నారు. బ్రహ్మసముద్రం మండలానికి నూతనంగా బీటీ రోడ్డు మంజూరుకాగా మంత్రి భూమి పూజ చేపట్టారని గుర్తుచేశారు. గత టీడీపీ ప్రభుత్వంలో ఆ పార్టీ నాయకులు అభివృద్ధి మాట మరిచి నీరు–చెట్టు పథకం ద్వారా రూ.వేల కోట్లు దోచుకున్నారన్నారు. కార్యక్రమంలో మండల రైతు సంఘం అధ్యక్షుడు గోపాల్ రెడ్డి, నాయకులు పాలబండ్ల చంద్రశేఖర్‌రెడ్డి, జిన్నా మల్లి, డీలర్ తిమ్మారెడ్డి, లక్ష్మీప్రసాద్, బాలరాజు, నీలంజనేయ, ముక్కన్న, పెన్నప్ప తదితరులు పాల్గొన్నారు.

నేడు మంజునాథస్వామి ఆరాధనోత్సవం



మంజునాథస్వామి మూలవిరాట్



నూతన శోభ సంతరించుకున్న ఆలయం

బెళుగుప్ప: మండల కేంద్రంలోని మంజునాథస్వామి ఆలయంలో సోమవారం నిర్వహించే 49వ ఆరాధనోత్సవం సందర్భంగా.. సేవాకమిటీ సభ్యులు దాతల సహాయంతో ఆలయానికి నూతన శోభను తీసుకువచ్చారు. ఆలయం చుట్టూ శివ స్వరూప దైవమూర్తుల శిల్పాలను ఏర్పాటు చేయించి ఆరాధనోత్సవానికి ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆలయం పక్కనే అశ్వర్థనారాయణస్వామి, నాగదేవతల కట్టను సర్వాంగసుందరంగా తీర్చిదిద్దారు. సోమవారం తెల్లవారుజాము నుంచే సుప్రభాతసేవతో మొదలై మహాగణపతిపూజ, అశ్వర్థనారాయణ, నాగదేవతలకు పంచామృతాభిషేకాలు, గౌరీసమేత మంజునాథస్వామికి పంచామృతాభిషేకాలు, బిల్వార్చన పూజలను నిర్వహించనున్నారు. అలాగే సామూహిక వరుణ ప్రార్థనలు, సాయంత్రం 4గంటలకు స్వామి ఆరాధన రథోత్సవ కార్యక్రమాలు చేపట్టనున్నారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం, రాత్రికి భజన బృందాలతో భజనలు చేపడతామని సేవాకమిటీ సభ్యులు, గ్రామపెద్దలు తెలిపారు.

శుభకార్యం

బొమ్మనహాళ్: మండలంలోని గోవిందవాడ గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు యర్రగుంట యల్లప్ప కుమారుడు గంగాధర, సంధ్య వివాహానికి రెడ్‌క్రాస్ సొసైటీ చైర్‌పర్సన్ కాపు భారతి హాజరై వధువరులను ఆశీర్వదించారు. అలాగే గోవిందావాడ గ్రామంలో కురుబ హనుమంతరెడ్డి నూతన గృహ ప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఈశ్వరరెడ్డి, నాయకులు లోకేష్, కోటేశ్వరరెడ్డి, తిప్పేస్వామి, దేవన్న, నాగరాజు, వన్నూరుస్వామి, నుంకేష్ , శీనా తదితరులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు

యాడికి: మండల కేంద్రంలోని ఆస్పత్రి కాలనీలో ఆదివారం ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి జూద కేంద్రంపై తన సిబ్బందితో దాడి చేశారు. ఇందులో భాగంగానే మండల కేంద్రానికి చెందిన రంగనాయకులు, రాజశేఖర్, రామాంజనేయులు, సుభాష్‌లను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.12,360 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌పీసీ శ్రీనివాసులురెడ్డి, చాంద్‌బాషా. భూపతిరాజు, శివ పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మానసిక ఒత్తిడిని జయించాలి

రాప్తాడురూరల్: మానసిక ఒత్తిడిని జయిస్తే ఆత్మహత్య చేసుకోవాలనే ఆలోచన ఉండదని మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీదేవి తెలిపారు. ఆదివారం ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవాన్ని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఉమెన్ డాక్టర్స్ ఆధ్వర్యంలో అనంతపురం నగరంలోని ప్రభుత్వ కళాశాల ఎస్సీ బాలికల వసతి గృహంలో జరుపుకున్నారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన శ్రీదేవి, ఆంధ్రప్రదేశ్ ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ చైర్‌పర్సన్ రామలక్ష్మి మాట్లాడారు. ఏదో సాధించాలనే తపన, ఏమీ సాధించలేదన్న నిరాశ, ఇంకేమీ సాధించలేమన్న నిస్సహాయ స్థితిలో చాలామంది నిండు జీవితాలను బలితీసుకుంటున్నారన్నారు. నేటి యువత చిన్న కారణాలకే తనువు చాలించి అయినవారికి ఆవేదన మిగులుస్తున్నారన్నారు. ప్రతి సమస్యకూ పరిష్కారం ఉంటుందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ జి.హేమలత, జన విజ్ఞాన వేదిక సభ్యురాలు డాక్టర్ ప్రసన్న, అనంతపూర్ ఐఎంఏ ఉమెన్ డాక్టర్స్ వింగ్ సెక్రటరీ డాక్టర్ సుమన గోపీచంద్, సైకాలజిస్ట్ ఆర్యన్ స్కూల్ ప్రిన్సిపాల్ లహరి తదితరులు పాల్గొన్నారు.

జోరందుకున్న వినాయక విగ్రహాల కొనుగోళ్లు



వినాయక విగ్రహాన్ని పరిశీలిస్తున్న కొనుగోలుదారులు

కూడేరు: వినాయక చవితి పండుగ దగ్గర పడుతుండడంతో బొజ్జ గణపయ్య విగ్రహాల కొనుగోలు జోరందుకుంది. ఈ నెల 18న పండుగ ఉండడంతో విగ్రహ తయారీ వారు వివిధ రకాల రూపాల్లో ఆకర్షణీయంగా బొజ్జ గణపయ్య విగ్రహాలను తయారు చేసి విక్రయాలకు సిద్ధంగా ఉంచారు. మండల పరిధిలోని కొనుకోలుదారు విగ్రహాలను ఎంపిక చేసుకోవడానికి కూడేరు, అనంతపురానికి తరలి వెళుతున్నారు. మూడు అడుగుల విగ్రహాలు రూ.3500 , 10 అడుగులవి రూ.15 వేలు,13 అడుగల విగ్రహాలు రూ.20 వేల చొప్పున ధర పలుకుతున్నాయి. నచ్చిన విగ్రహాన్ని ఎంపిక చేసుకుని.. అడ్వాన్స్ ఇచ్చి విగ్రహాలను బుక్ చేసుకుంటున్నారు.

సంగమేశ్వరాలయంలో 'పెళ్లి సందడి'

కూడేరు: శ్రావణ మాసంలో పెళ్లిల్లకు ఆదివారంతో శుభముహుర్తం ముగియనుంది. మళ్లీ కార్తీక మాసం (రెండు నెలలు) వరకూ శుభ ముహూర్తాలు లేవు. ఆదివారం బలమైన ముహూర్తం కావడంతో కూడేరులో ప్రసిద్ధిగాంచిన శివపార్వతుల జోడు లింగాల సంగమేశ్వర స్వామి ఆలయంలో అధిక సంఖ్యలో పెళ్లిళ్లు జరిగాయి. వివాహ కార్యక్రమాలకు వధూవరుల బంధు మిత్రులు పెద్దఎత్తున తరలిరావడంతో ఆలయం వద్ద పెళ్లి సందడి నెలకొంది. పెళ్లిళ్లకు వచ్చిన వారు శివపార్వతుల జోడు లింగాలను దర్శించుకునేందుకు క్యూ కట్టారు.

ద్విచక్ర వాహనాల వేలం రేపు

రాయదుర్గం: రాయదుర్గం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్) పోలీస్‌స్టేషన్ పరిధిలోని పట్టుబడిన ద్విచక్ర వాహనాలను ఈ నెల 12న సెబ్ అడిషనల్ ఎస్పీ ఆధ్వర్యంలో వేలం నిర్వహిస్తున్నట్టు సీఐ జయనాథ్‌రెడ్డి ఆదివారం తెలిపారు. వేలంలో పాల్గొనే వారు రూ.3,000 దరావత్తు చెల్లించాలన్నారు. ఆసక్తి ఉన్నవారు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

12 నుంచి స్కూల్ గేమ్స్

శెట్టూరు: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ నెల 12 నుంచి మండల స్థాయి పాఠశాల క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు స్కూల్ గేమ్స్ కోఆర్డినేటర్ ఎర్రిస్వామి ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అండర్-14, -17 బాల బాలికల విభాగాలలో ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, టెన్నికాయిట్, బాల్ బ్యాట్మింటన్, షటిల్, త్రోబాల్, యోగా, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహిస్తామన్నారు. మండల స్థాయిలో రాణించిన క్రీడాకారులను నియోజకవర్గ స్థాయికి ఎంపిక చేస్తామన్నారు. వివరాలకు 9492600901 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

బ్రహ్మసముద్రం: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ నెల 12న మండల స్థాయి స్కూల్ గేమ్స్ నిర్వహిస్తున్నట్లు కోఆర్డినేటర్ ఇబ్రహీం ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అండర్- 14-19 బాల, బాలికల విభాగాలలో ఖోఖో, కబడ్డీ , వాలీబాల్, టెన్నికాయిట్, బాల్ బాట్మింటన్, షటిల్, త్రోబాల్, యోగా ,అథ్లెటిక్స్ పోటీలను నిర్వహిస్తామన్నారు. మండల స్థాయిలో రాణించిన క్రీడాకారులు నియోజకవర్గ స్థాయిలో జరిగే పోటీలకు అర్హత సాధిస్తారన్నారు.

పంటలు కళ కళ



బ్రాహ్మణపల్లి వద్ద పచ్చగా మారిన కంది పంట

కూడేరు: ఇటీవల మండలంలో ఓ మోస్తరుగా కురిసిన వర్షానికి పంటలు పచ్చగా మారాయి. పి.నారాయణపురం, కరుట్లపల్లి, చోళసముద్రం, కూడేరు, కడదరకుంట, ఇప్పేరు, కమ్మూరు, బ్రాహ్మణపల్లి, గొటుకూరు, రామచంద్రాపురం, జల్లిపల్లి,మరుట్ల, అంతరగంగతో పాటు మరికొన్ని గ్రామాల్లో కంది సుమారు 5 వేల ఎకరాల్లో, ఆముదం సుమారు 6 వేల ఎకరాల్లో , వేరుశనగ, ఇతర పంటలు సుమారు 4 వేల ఎకరాల్లో రైతులు సాగు చేసి ఉంటారు. విత్తనం విత్తాక ఓ మోస్తరుగా వర్షం కురిసింది. తర్వాత వర్షాభావం ఏర్పడడంతో పంటలు ఎండుముఖం పట్టాయి. ఇటీవల కురిసిన వర్షం ఎండుతున్న పంటలకు ఊరటనిచ్చింది. పంటలు పచ్చగా మారుతుండడంతో రైతులు ఊపిరి పీల్చుకుంటున్నారు.

గడప గడపతో 'ప్రగతి బాటలు'

- ఇటీవల 'మున్సిపాలిటీ'లో ముగిసిన కార్యక్రమం
- 18 సచివాలయాలకు రూ.3.60 కోట్ల నిధులు



30 ఏళ్ల తరువాత సీసీ రోడ్డుకు నోచుకున్న ఈద్గాకు వెళ్లే రోడ్డు



కొండ ప్రాంతమైన సిద్దేశ్వర కాలనీలో సీసీ రోడ్డు పనులు

రాయదుర్గంటౌన్: పట్టణంలో 'గడప గడపకూ మన ప్రభుత్వం' కింద గుర్తించిన అభివృద్ధి పనులు(ప్రధానంగా సీసీ రోడ్లు, డ్రైనేజీలు) ముమ్మరంగా కొనసాగుతున్నాయి. దశాబ్దాల నాటి మట్టి రోడ్లకు మోక్షం లభించి రాకపోకలకు సుగమమైంది. సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలన కొనసాగుతోంది. 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమం ద్వారా క్షేత్రస్థాయిలో ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం పెద్దపీట వేసింది. కేవలం సంక్షేమ పథకాలు అందించడమే కాకుండా అభివృద్ధి కూడా చేసి చూపించాలనే ఉద్దేశ్యంతో ఒక్కో సచివాలయానికి రూ.20 లక్షల మేర 18 సచివాలయాలకు రూ.3.60 కోట్ల నిధులతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు.

పట్టణంలోని 32 వార్డుల్లో ఇటీవల ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని పూర్తి చేశారు. సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, వార్డు కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులతో కలిసి ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలను క్షేత్రస్థాయిలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకున్నారు.

ముమ్మరంగా అభివృద్ధి పనులు

పట్టణంలోని 18 సచివాలయాలకు 'గడప గడప' కింద రూ.3.60 కోట్ల నిధులు మంజూరు చేయగా ఇప్పటి దాకా గుర్తించిన 54 సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులకు గానూ 27 పనులు పూర్తి చేశారు. మరికొన్ని వివిధ దశల్లో పనులు జరుగుతుండగా కొన్నింటికి టెక్నికల్ అనుమతి రావాల్సి ఉంది. అనేక వార్డుల్లో ఏళ్ల తరబడి సీసీ రోడ్లకు నోచుకుని మట్టి రోడ్లకు మోక్షం లభించింది. పట్టణంలోని 17, 18వ వార్డుల పరిధిలోని గుగ్గిరొట్టి కుబా మసీదు ప్రధాన రహదారి నుంచి అజాద్ స్కూల్‌కు వెళ్లే రహదారికి దాదాపు 40 ఏళ్ల తరవాత మోక్షం లభించి రోడ్డు నిర్మాణం పూర్తవడంతో కాలనీవాసుల ఆనందానికి అవధుల్లేవు. అలాగే 1వ వార్డు పరిధిలో ఏకేపీపీ స్కూల్ వద్ద నుంచి బళ్లారి రోడ్డుకు లింకు రోడ్డు, 30వ వార్డులో ఈద్గాకు వెళ్లే రోడ్డు, ఇలా ప్రతి వార్డుల్లోనూ రోడ్లు, డ్రైనేజీలకు మోక్షం లభించింది. ఇలా అన్ని వార్డుల్లోనూ అవసరమైన చోట్ల ప్రాధాన్యత క్రమంలో 'గడప గడప' కింద మంజూరైన నిధులతో సీసీ రోడ్లు వేస్తుండడంతో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

దశాబ్దాల తరువాత సీసీ రోడ్డు సమస్య తీరింది



ఏళ్ల తరబడి సీసీ రోడ్డు లేక రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడ్డాం. ప్రధానంగా ఈద్గాకు వెళ్లే దారికావడంతో నమాజ్‌కు వేలాది మంది ముస్లిం సోదరుల రాకపోకలు ఉంటాయని గతంలో పలుమార్లు మత పెద్దలు సీసీ రోడ్డు వేయాలని విన్నవించారు. గడప గడప కింద ప్రభుత్వం నిధులు మంజూరుచేసి రోడ్డు వేయించడం ఎంతో సంతోషంగా ఉంది. మా సమస్యను గుర్తించి సీసీ రోడ్డు వేయించేందుకు కృషి చేసిన ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి, కౌన్సిలర్ గోరంట్ల ఉష, వార్డు ఇన్‌చార్జ్ సత్యనారాయణకు కృతజ్ఞతలు.

–పీరాసాబ్, ఈద్గా రోడ్డు, 30వ వార్డు, రాయదుర్గం

అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట



దేశంలో ఎక్కడూ లేని విధంగా 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమంతో ప్రజలతో మమేకమై వారి సమస్యలను క్షేత్రస్థాయిలో పరిష్కరించేలా ఇంటింటికి తిరిగే అవకాశం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాకు కల్పించడం అదృష్టం. అపద్దాలతో గత ఐదేళ్లు టీడీపీ కాలం వెళ్లదీసి ప్రజలను మోసం చేస్తే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ నాలుగేళ్లలోనే నియోజకవర్గంలో 40 ఏళ్ల అభివృద్ధిని చేసి చూపించాం. పట్టణంలో డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరిచేందుకు రూ.20 కోట్ల మంజూరు కోసం ప్రతిపాదన పంపించాం.

– ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి

144 సెక్షన్ అమలు



బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు

కళ్యాణదుర్గం: పట్టణంలో 144 సెక్షన్ అమలు చేస్తున్నట్లు కళ్యాణదుర్గం డీఎస్పీ బి.శ్రీనివాసులు తెలిపారు. అవినీతి కేసులో టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబుకు ఆదివారం రాత్రి కోర్టు రిమాండ్‌కు ఆదేశించడంతో ముందస్తు చర్యల్లో భాగంగా 144 సెక్షన్ అమలు చేశామన్నారు. పోలీసుల అనుమతులు లేకుండా ఎక్కడా ధర్నాలు, నిరసనలు చేయకూడదన్నారు. పోలీసు ఉత్తర్వులను ధిక్కరించి ఎక్కడైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ హెచ్చరించారు. పట్టణంతో పాటు నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో గట్టి బందోబస్తు చర్యలు చేపట్టామన్నారు.